సాక్షి
శ్రీకాకుళం

సోమవారం । 18 । సెప్టెంబర్ । 2023



ఆయిల్‌పామ్ సాగు..

ఆయిల్ పామ్ సాగుపై రైతులు మొగ్గు చూపుతున్నారు. ప్రభుత్వం రాయితీలు కూడా అందిస్తోంది. - 8లో



రోడ్డు ప్రమాదంలో..

రోడ్డు ప్రమాదంలో ఓ డిగ్రీ విద్యార్థి మృతి చెందాడు. నరసన్నపేట సమీపంలో ప్రమాదం జరిగింది. - 8లో

ఐదు సచివాలయాలకు నిధుల మంజూరు

సారవకోట: మండలంలోని ఐదు సచివాలయాల పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తయిందని, దీంతో ఆయా సచివాలయాల పరిధిలోని పంచాయతీలకు నిధులు మంజూరైనట్లు ఎంపీడీఓ ఆర్.రాంబాబు ఆదివారం తెలిపారు. దీంట్లో ధర్మలక్ష్మీపురం, మాకువ, కేశవలస, బద్రి, గుమ్మపాడు సచివాలయాలకు ఒక్కొక్క సచివాలయానికి రూ.20 లక్షల చొప్పున మంజూరైనట్లు పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

కొత్తూరులో భారీ వర్షం



కొత్తూరులో కురుస్తున్న వాన

కొత్తూరు: కొత్తూరు మండల వ్యాప్తంగా ఆదివారం రాత్రి భారీ వాన కురిసింది. దీంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. సుమారు గంటన్నర పాటు కురిసిన వర్షానికి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. వినాయక చవితి కావడంతో మార్కెట్‌లో పండ్ల దుకాణదారులతో పాటు వినాయక విగ్రహాలు విక్రయిస్తున్న వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు. వినాయక మండపాల ఏర్పాటుకు కూడా వాన విఘాతం కలిగించింది.

ముగ్గురిపై కేసు నమోదు

టెక్కలి రూరల్: పట్టుపలసరియా గ్రామంలో గణేష్ మండపం ఏర్పాటు విషయంలో తలెత్తిన గొడవలో ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్టు పోలీసులు ఆదివారం తెలిపారు. ఈ గ్రామంలో ఏటా వినాయకుడి మండపం ఏర్పాటు చేసే స్థలంలో గండేటి భీమారావు తెలుగుదేశం పార్టీ జెండాను ఏర్పాటు చేశారు. అయితే గ్రామానికి చెందిన కొంత మంది యువకులు మండపం పనులకు అడ్డంగా ఉందనే ఉద్దేశంతో ఆ జెండాను పక్కకు మార్చారు. అది గుర్తించిన భీమారావు, అతని కుమారుడు, భార్య ఒక్కసారిగా యువకులపై దాడిచేశారు. దీంతో గాయాలకు గురైన సార అప్పయ్యతో పాటు మరికొంత మంది యువకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని ఆ ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

జిల్లా ఖోఖో సంఘ నూతన కార్యవర్గం ఎన్నిక

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా ఖోఖో అసోసియేషన్ నూతన కార్యవర్గం ఆదివారం ఎన్నికైంది. జిల్లా చైర్మన్‌గా పొన్నాడ రవికుమార్ ఎన్నిక కాగా, జిల్లా అధ్యక్షునిగా వరుసగా మరోసారి చిట్టి నాగభూషణంను ఏగ్రీవంగా ఎన్నుకున్నారు. శ్రీకాకుళం నగరంలోని బలగ హాస్పటల్ జంక్షన్ సమీపంలో ఉన్న భరాతి ఐటీసీ ప్రాంగణంలో జరిగిన సర్వసభ్య సమావేశం అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా క్రీడాప్రాధికార సంస్థ, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్, రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ ప్రతినిధులు, అధికారులు పరిశీలకులుగా, ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు.

నూతన కార్యవర్గం

జిల్లా ఖోఖో అసోసియేషన్ చైర్మన్‌గా పొన్నాడ రవికుమార్, చీఫ్ ప్యాట్రన్‌గా బాన్న పవన్‌కుమార్, జిల్లా అధ్యక్షునిగా చిట్టి నాగభూషణం, ప్రధాన కార్యదర్శిగా సీహెచ్ ఫల్గుణరావు, కోశాధికారిగా బాడాన నారాయణరావు, ఉపాధ్యక్షులుగా బి.తిరుమలరావు, జీఎం జ్యోతిరాణి పి.రామకృష్ణ, సంయుక్త కార్యదర్శులుగా ఎం.నీలాద్రిరావు, టి.మురళీమోహనరావు, ఆర్‌వీ రత్నం, కార్యవర్గ సభ్యులుగా కె.తిరుపతిరావు, ఎస్.పార్వతి, డి.కిషన్‌కుమార్, జె.ప్రదీప్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

'పాత గీతాలు మధురమైనవి'



కళాకారులను సత్కరిస్తున్న మంత్రి ధర్మాన

శ్రీకాకుళం కల్చరల్: పాత పాటలు ఆపాతమధురాలని, అవి చిరస్థాయిగా నిలిచి ఉంటాయని రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. స్థానిక బాపూజీ కళామందిర్‌లో విశాఖకు చెందిన నారీభేరీ సంస్థ సుకుమార్ ఆర్కెస్ట్రా సంయుక్త నిర్వహణలో ఘంటసాల, ఎస్పీ బాలు సినీ సంగీత విభావరి ఆదివారం జరిగింది. కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. నిర్వాహకులు ఎంతో విశేషమైన ప్రతిభ కలిగిన వారు కావడంతో చక్కనైన గీతాలను వీనుల విందుగా ఆలపించారన్నారు. అనంతరం మంత్రి ధర్మాన కళాకారులను సంస్థ తరఫున సత్కరించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, కళాప్రవీణ బండారు చిట్టిబాబు, డాక్టర్ నిక్కు అప్పన్న, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎంవీ పద్మావతి, నారీ భేరీ ప్రతినిధులు కింతలి భాగ్యలక్ష్మి, సీవీ రాజేశ్వరి, శైలజ మొరాజ్, కొంక్యాణ గోవిందరాజులు చారిటబుల్ ట్రస్టు ప్రతినిధులు కొంక్యాన వేణుగోపాల్, మండవిల్లి రవి, తదితరులు పాల్గొన్నారు. మధురమైన గీతాలను కెఎల్ఎన్ మూర్తి, రాజమోహన్, హేమచంధర్, శ్రీనివాసరావు, భాగ్యలక్ష్మీ, కూర్మారావు, శైలజ, నాగభూషన్, పండరికుమార్ తదితరులు వీనుల విందుగా పాడారు.

చవితి వేడుక.. ఊరూవాడా వేదిక

నేడు మొదలు మరో తొమ్మిది రోజులు లంబోదరుని అష్టోత్తరాలు సుప్రభాతంలా వేకువన వినిపిస్తాయి. సంధ్యా సమయాలు విఘ్న నాయకుని మండపాల వీక్షణతో అందంగా గడుస్తాయి. రాత్రిళ్లు ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పరిపూర్ణంగా ముగుస్తాయి. గజాననుడి ఆగమనానికి సిక్కోలు సిద్ధమైంది. చవితి సంబరాన్ని నిండు గుండెతో నిర్వహించుకోవడానికి మండపం వేసి మరీ సన్నద్ధమైంది. విఘ్న నాయకుడిని పూజ కోసం బిళ్వ పత్రాలు, మామిడి తోరణాలు, అర్చన సామగ్రి విక్రయాలతో మార్కెట్లన్నీ ఆదివారం కళకళలాడాయి. మరోవైపు మట్టి వినాయకుడినే పూజించాలంటూ ఊరూవాడా ప్రచారాలు జరిగాయి.



శ్రీకాకుళంలోని మార్కెట్‌లో కొనుగోలుదారుల సందడి



కొత్తూరు: మట్టి విగ్రహాలు వాడాలంటున్న నివగాం జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు



టెక్కలి: వినాయక విగ్రహాన్ని తీసుకెళ్తున్న దృశ్యం



పలాసలో విక్రయానికి వచ్చిన కలువ పూలు

అబ్బురపరుస్తున్న హరిద్రా గణపతి

కవిటి: కవిటి మండలం బొరివంక కేంద్రంగా పనిచేస్తున్న బాలగణపతిఉద్దానం యూత్ క్లబ్ ఆధ్వర్యంలో శిల్పి భైరి తిరుపతిరావు చేసిన హరిద్రా గణపతి చూపరులను అబ్బురపరుస్తోంది. గత 18 ఏళ్లుగా వివిధ రూపాల్లో గణపతి విగ్రహాల తయారీలో రికార్డులు సాధించిన ఉద్దానం యూత్ క్లబ్ ఈ ఏడాది సైతం మరో వినూత్న ఆలోచనతో ముందుకువచ్చింది. ఈ సంవత్సరానికి సూచికగా 2023 పసుపు కొమ్ములను నేరుగా రైతు వ్యవసాయ క్షేత్రం నుంచి కొనుగోలు చేసి ఈ గణనాథుడిని తయారుచేశారు. గడ్డి, బంకమట్టితో ప్రాథమికంగా తయారుచేసిన విగ్రహానికి పైన పసుపు కొమ్ముల్ని అందంగా అలంకరించి హరిద్రా గణపతి విగ్రహానికి రూపాన్నిచ్చారు.



హరిద్రా గణపతి

మట్టి గణపతి మహాశ్రేష్ఠం



చవితి వేడుకకు మట్టి గణపతే మహాశ్రేష్ఠం. ఆ గణేశుని అనుగ్రహం పొంది ప్రతి ఇంటా సుఖ సంతోషాలు వర్ధిల్లాలి. వినాయకుడిని ప్రతిష్ఠించేందుకు మండపాలు, పందిళ్లు ఏర్పాటు చేస్తున్న వారు జాగ్రత్తలు తీసుకోండి. పర్యావరణానికి విఘాతం కలగకుండా పండగ చేసుకోవాలి.

– తమ్మినేని సీతారాం, స్పీకర్


సుఖ సంతోషాలతో జరుపుకోవాలి



ప్రజలంతా సుఖ సంతోషాలతో వినాయక చవితిని జరుపుకోవాలి. ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు. ప్రజలంతా సకల సౌభాగ్యాలతో ఆయురారోగ్యాలతో ఉండాలి.

– ధర్మాన ప్రసాదరావు, మంత్రి

ఆశీస్సులు ఉండాలి



జిల్లా ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు. జిల్లా ప్రజలందరికీ గణనాథుడి ఆశీస్సులు ఉండాలి.

– ధర్మాన కృష్ణదాస్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు

గణేశుని అనుగ్రహం పొందాలి



పర్యావరణానికి కీడు చేయకుండా గణేశుని అనుగ్రహం పొందాలి. నేడు జిల్లా పోలీసు కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించడం లేదు. గమనించాలి. – జీఆర్ రాధిక, ఎస్పీ

ప్రజారోగ్యానికి ప్రాధాన్యత



జలుమూరులో ఇంటింటా సర్వే నిర్వహిస్తున్న వైద్య బృందాలు

- జగనన్న ఆరోగ్య సురక్షలో ఇంటింటా ముమ్మర సర్వే
- జిల్లాకు ముగ్గురు పర్యవేక్షణ అధికారులు
- వైద్యారోగ్య శాఖలో చరిత్రాత్మక కార్యక్రమానికి శ్రీకారం



జలుమూరు, బూర్జ: ప్రజారోగ్యానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోంది. ఒక వైపు ఆరోగ్యశ్రీ, మరో వైపు ఫ్యామిలీ డాక్టర్ వైద్యం అందిస్తూనే జగనన్న ఆరోగ్య సురక్ష పథకానికి శ్రీకారం చుట్టింది. ఈ కార్యక్రమంలో భాగంగా ఇప్పటికే ఇంటింటా సర్వే ముమ్మరంగా జరుగుతోంది. జిల్లా వ్యాప్తంగా ఈ సర్వే పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు ముగ్గురు పర్యవేక్షణ అధికారులను కూడా నియమించింది. దీనికి తోడు నియోజకవర్గాలకు కూడా వైద్యాధికారులను పర్యవేక్షణ కోసం ప్రభుత్వం నియమించింది. గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు అధికారులు దిశానిర్దేశం చేస్తున్నారు.

మండలాల్లో వైద్యశిబిరాలు..

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా మండలాల వారీగా ఈ నెల 30 నుంచి మెగా వైద్య శిబిరాలు నిర్వహిస్తారు. ప్రతి శిబిరంలో ఇద్దరు వైద్యులు ఉంటారు. వీరితోపాటు 104 వైద్యులు అందుబాటులో ఉంటారు. ఒక మండలంలో ఎన్ని హెల్త్ క్లినిక్స్ ఉన్నాయో ఆ పరిధిలో గుర్తించిన రోగులందరికీ ఆ రోజు వైద్య పరీక్షలు నిర్వహించి చికిత్స అందజేస్తారు. హెల్త్ శిబిరాల నిర్వహణలో ఎంపీడీఓ, తహసీల్దార్‌తో పాటు అన్ని శాఖల అధికారులు పాల్గొంటారు. ప్రతి ఇంటికీ వెళ్లి ఆరోగ్యంపై అవగాహన కల్పించడంతోపాటు జబ్బులకు గుర్తించడం ఒక పనయితే, వారికి చికిత్స చేసేందుకు రిఫరల్ చేయడం రెండో అంశం. ఈ రెండు అంశాలే కీలకం. దీనికి తోడు ఈ శిబిరాల్లో దీర్ఘకాలిక వ్యాధులైన షుగర్, కేన్సర్, గుండె, కిడ్నీ, బీపీ వంటి సమస్యలకు చికిత్స అందజేస్తారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారు. సర్వేలో ఆరోగ్య కార్యకర్త, కమ్యూనిటీ హెల్త్ అధికారి సంయుక్తంగా గ్రామంలో ప్రతి ఇంటిని సందర్శించి కుటుంబంలో ప్రతి ఒక్కరికీ పరీక్షలు నిర్వహిస్తారు. ఆ పరీక్షల్లో ఏదైనా వ్యాధి ఉన్నట్లు నిర్ధారణ జరిగితే ఆ రోగికి ఒక ఐడీ నంబర్‌తోపాటు కేస్ షీటు ఇస్తారు. ఆ వ్యాధి సంబంధిత స్పెషలిస్టు వద్ద వైద్యం తీసుకోవచ్చు.

జిల్లా అధికారులు వీరే..



జిల్లా అధికారులుగా డీఎంహెచ్ఓ బొడ్డేపల్లి మీనాక్షి, జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ టీబీ అధికారి అనురాధ, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి ఆర్‌వీఎస్ కుమార్‌లు కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్నారు.

నియోజకవర్గాలకు..

ఇచ్ఛాపురం:	డాక్టర్ పి.శ్రీదేవి
పలాస:	డాక్టర్ జీవీ లక్ష్మి
టెక్కలి:	డాక్టర్ ఎం.ప్రసాదరావు
పాతపట్నం:	డాక్టర్ పీవీ సత్యనారాయణ
అర్బన్ హెల్త్ సెంటర్లు(శ్రీకాకుళం, ఆమదాలవలస, పలాస, ఇచ్ఛాపురం) :	డాక్టర్ పి.వి లింగరాజు
ఆమదాలవలస:	జి.సన్యాసిరావు
ఎచ్చెర్ల:	కె.రవి ప్రసాద్
నరసన్నపేట:	డాక్టర్ ప్రవీణ్
శ్రీకాకుళం:	శ్రీనివాసరావు

వీరితో పాటు మండలాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం పర్యవేక్షణ చేసేందుకు ఆయా ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సీనియర్ వైద్యులను 30 మండలాలకు 30 మందిని నియమించారు. వీరు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి రోజువారీ నివేదికలను తెప్పించుకుని జిల్లా వైద్యాధికారితో సమన్వయం చేసుకుంటారు.

చరిత్రాత్మక కార్యక్రమం



ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య శాఖ చరిత్రలో ఎన్నడూ ఇలాంటి కార్యక్రమాలు జరగలేదు. గతంలో సాధారణంగా వైద్య శిబిరాలు మాత్రమే నిర్వహించేవారు. ఈ సారి మాత్రం వైద్య శిబిరాలకు 15 రోజులు ముందుగానే ఇంటింటికీ వెళ్లి సర్వే చేసి అర్హులైన వారికి నెట్‌వర్క్ ఆస్పత్రులతోపాటు స్పెషలిస్ట్ వైద్యులను కోరుకునే ప్రత్యేక అవకాశం కల్పించడం జరుగుతుంది. – బి.మీనాక్షి, డీఎంహెచ్ఓ

జోరుగా వరినాట్లు



ఇటీవల కురిసిన మోస్తరు వర్షాలకు కేదారిపురం, ముచ్చింద్ర, కీర్తిపురం, లొద్దపుట్టి, బిర్లంగి ప్రాంతాల్లో వరినాట్లు ఊపందుకున్నాయి. ఇప్పటి వరకు అంతగా వర్షాలు లేకపోవడంతో సుమారు ఐదు వేల ఎకరాల్లోనే వరినాట్లు వేశారని, అయితే ప్రస్తుతం కురిసిన వర్షానికి మరో వంద ఎకరాల్లో రైతులు వరినాట్లు వేస్తున్నారని ఏఓ పూజారి సత్యనారాయణ తెలిపారు. -ఇచ్ఛాపురం రూరల్

'విశ్వకర్మలకు ప్రత్యేక కార్పొరేషన్ ఘనత సీఎం జగన్‌దే'

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): విశ్వకర్మ జయంతి సందర్భంగా వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఉదయం నిర్వహించిన వేడుకలకు పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ హాజరయ్యారు. విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. అనంతరం కృష్ణదాస్ మాట్లాడుతూ విశ్వకర్మల కోసం ప్రత్యేకంగా బీసీ కార్పొరేషన్ ఏర్పాటు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కు దక్కుతుందని అన్నారు. రాష్ట్రంలో 26 లక్షల మంది పంచవృత్తుల వారున్నారని వారికి ప్రభుత్వం నుంచి అన్ని విధాలా సహాయ, సహకారాలు అందుతున్నాయని, మంచి జరిగితేనే తమను ఆశీర్వదించాలని సీఎం చెప్పారని పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో రూ.కోటి ప్రభుత్వ నిధులతో ప్రత్యేకంగా విశ్వకర్మల కోసం సామాజిక భవన నిర్మాణం తమ హయాంలోనే జరిగినట్లు వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా పండుగ వాతావరణంలో విశ్వకర్మ జయంత్యుత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ముందుకు రావడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు.



వైఎస్సార్ సీపీ కార్యాలయంలో విశ్వకర్మ పూజ చేస్తున్న దృశ్యం

కార్యక్రమంలో కళింగ కోమటి కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, పార్టీ జిల్లా కార్యదర్శి శిమ్మ రాజశేఖర్, యువజన విభాగం అధ్యక్షుడు ఎంవీ స్వరూప్, ఉపాధ్యక్షుడు రొతు శంకరరావు, ఎన్ని ధనుంజయరావు, వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ గంగు శారద, సుగుణారెడ్డి, గౌతమి, విశ్వబ్రాహ్మణ జిల్లా గౌరవాధ్యక్షులు సింహాద్రి ధనుంజయాచారి, డీఎస్‌కే ప్రసాద్, రత్నాల నర్సింహమూర్తి, కోటేశ్వరరావు చౌదరి తదితరులు పాల్గొన్నారు.

సిద్ధయ్యకు ఘనంగా నివాళులు



ఏసీ సిద్ధయ్యకు నివాళులర్పిస్తున్న భాషోపాధ్యాయ సంస్థ రాష్ట్ర, జిల్లా ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ వ్యవస్థాపక సభ్యుడు ఏసీ సిద్ధయ్య భాషోపాధ్యాయులకు చేసిన సేవలు మరువలేనివని భాషోపాధ్యాయ సంస్థ నాయకులు గుర్తు చేసుకున్నారు. ఇటీవల స్వర్గస్తులైన విద్వాన్ ఏసీ సిద్ధయ్య సంస్మరణ సభ ఆదివారం శ్రీకాకుళంలోని రెవెన్యూ అసోసియేషన్ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా విద్యాశాఖలో అనేక సమస్యలతోపాటు 25 ఏళ్లుగా భాషోపాధ్యాయుల ఉన్నతికి అవిశ్రాంతంగా శ్రమించారని అన్నారు. ఈ సందర్భంగా ఏసీ సిద్ధయ్య చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాండ్రంగి గౌరీకుమార్, రాష్ట్ర కార్యదర్శి పట్నాన వెంకటరమణ, జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పిసిని వసంతరావు, కూన రంగనాయకులు, పెంట శివరామకృష్ణ పాల్గొన్నారు.

జిల్లా అథ్లెటిక్స్ క్రీడాకారుల జాబితా ఖరారు



లాంగ్‌జంప్ సాధనలో ఓ అథ్లెట్

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా జూనియర్స్ అథ్లెటిక్స్ క్రీడాకారుల జాబితా ఖరారైంది. ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు గుంటూరు జిల్లా ఆచార్య నాగార్జున యూనివర్సిటీ క్రీడామైదానం వేదికగా ఏపీ రాష్ట్ర స్థాయి జూనియర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్-2023 పోటీలు జరగనున్నాయి. ఈ పోటీల్లో పాల్గొనే జిల్లా అథ్లెటిక్స్ క్రీడాకారులను ఇటీవల శ్రీకాకుళంలో ఎంపికచేసిన విషయం తెలిసిందే. ఈ ఎంపిక పోటీల్లో రాణించిన 80 మందికిపైగా క్రీడాకారులతో కూడిన జాబితాను అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కొన్న మధుసూదనరావు, ప్రధాన కార్యదర్శి మెంటాడ సాంబమూర్తి ఆదివారం ప్రకటించారు. ఎంపికైన క్రీడాకారులంతా ఈనెల 19వ తేదీన రాత్రి కోణార్క్ ట్రైన్‌కు పయనవుతున్నట్టు చెప్పారు. తమ లగేజీతోపాటు జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, మూడు పాస్‌ఫొటోలతో హాజరుకావాలని వారు కోరారు. మరిన్ని వివరాలకు 8500271575 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

రాష్ట్రపోటీలకు ఎంపికైన అథ్లెట్స్ వీరే..

అండర్–14 బాలబాలికలు: డి.అశోక్, జి.సాయినిఖిల్, డి.దివాకర్, కె.చందు, ఎస్.కుమారస్వామి, టి.పవన్, ఆర్.స్వాతి, యు.అర్చన, జి.ఉషా, ఎ.మేఘన, కె.జానకి, పి.యశ్విత, డి.మోహిత.

అండర్–16 బాలబాలికలు: ఎస్.జ్యోతీశ్వర్, జి.అభిరాం, పి.చైతన్య, వి.భాస్కరరావు, టి.రాము, పి.సాయికిరణ్, ఎం.రామినాయుడు, కె.యాదగిరి, కె.కృపాసిందు, పి.అశోక్, కె.కార్తిక్, బి.సోనియా, డి.భాను, ఎం.మాధురి, పి.సంజన, ఎస్.తులసి, ఎం.ద్రాక్షాగీతా బెహర, మౌనిక మిశ్రా, టి.జయలక్ష్మి.

అండర్–18 బాలబాలికలు: కె.సాయికిరణ్, పి.హర్షవర్ధన్, జె.రవి, వి.రాజశేఖర్, బి.కాళి, డి.చాణక్య, కె.నరేంద్ర, బి.మోక్ష, బి.కృష్ణ, వి.చిరంజీవి, టి.తరుణ్, పి.ఈశ్వరరావు, టి.శ్రీధర్, సీహెచ్ భార్గవి, జె. శివాణి, పి.శ్రీలత, ఎ.యామిని, ఆర్.అనూష, డి.రేష్మ.

అండర్–20 పురుషులు, మహిళలు: జె.రవి, కె.వల్లభ, గణేష్‌పండా, బి.సాయి, వై.రాము, ఆర్.మహేష్, కె.ప్రవీణ్‌కుమార్, కె.రాజేష్, టి.జశ్వంత్, ఎస్.జాస్మిన్, ఎ.సూర్యప్రకాష్, బి.హారిక, హెచ్ కల్పన, బి.వెంకటలక్ష్మి, ఎం.శ్రావణి, ఎం.ప్రవల్లిక, జి.తేజ, బి.గుప్త.

అండర్–23 పురుషులు, మహిళలు: పి.మణికంత, బి.జయరాం, వి.రాజశేఖర్, పి.సంతోష్, యు.తిరుపతిరావు, వై.కార్తీక్, ఎ.సాహస్, ఓ.శంకరరావు, ఎం.కృష్ణంరాజు, పాల్ దినకర్, వి.మెగ్నా, ఎ.విజయ్, ఆర్.కోకిల ఎంపికైనవారిలో ఉన్నారు. జిల్లా క్రీడాకారుల బృంధానికి కోచ్, మేనేజర్లుగా పీడీలు వి.మురళి, టి.ఆనంద్, కె.రామారావు వ్యవహరించనున్నారు.

క్లుప్తంగా

ఆదిత్యుని సన్నిధిలో ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్ర మీనా



ఆదిత్యుని జ్ఞాపికను ట్రైనీ కలెక్టర్‌కు అందజేస్తున్న ఈఓ హరిసూర్యప్రకాష్

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని జిల్లా ట్రైనీ కలెక్టర్ కె.రాఘవేంద్ర మీనా తన కుటుంబసభ్యులతో కలిసి ఆదివారం ఉదయం తొలిసారిగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ సిబ్బంది గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. ఆలయ విశిష్టత, పర్వదినాల విశేషాలను ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ వారికి వివరించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్, పాలకమండలి సభ్యుడు మండవిల్లి రవి తదితరులున్నారు. అనంతరం ఆదిత్యుని జ్ఞాపికను అందజేశారు.

ఉత్తరాంధ్ర ఉక్కు రక్షణ యాత్ర వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

రణస్థలం: విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు సెప్టెంబర్ 20 నుంచి 29 వరకు సీపీఎం ఉత్తరాంధ్ర ఉక్కు రక్షణ బైక్ యాత్ర జయప్రదం చేయాలని సీపీఎం నాయకులు వెలమల రమణ, సీహెచ్ అమ్మన్నాయుడులు కోరారు. మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో ఆదివారం ఉక్కు రక్షణ బైక్ యాత్ర గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉక్కు బైక్ యాత్ర సెప్టెంబర్ 20న విశాఖపట్నంలో ప్రారంభమై 22న పొందూరు మీదుగా ఎచ్చెర్ల చేరుకుంటుందని, 22,23 తేదీల్లో శ్రీకాకుళం జిల్లాలో బైక్ యాత్ర సాగుతుందని తెలిపారు. ఆరు జిల్లాలో 1200 కిలోమీటర్లు సాగి 29వ తేదీన స్టీల్ ప్లాంట్ వద్ద చేపడుతున్న నిరాహార దీక్ష శిబిరం వద్ద ముగిస్తుందని చెప్పారు. ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభకు అఖిల భారత నాయకులు హాజరవుతారని తెలియజేశారు.

కంబకాయలో చోరీ



ఇంటిలో తెరిచి ఉన్న బీరువా

నరసన్నపేట: మండలం కంబకాయలో పాగోటి రమేష్ ఇంటిలో ఆదివారం వేకువజామున చోరీ జరిగింది. ఇంటిలో 16 తులాల బంగారు ఆభరణాలు దొంగిలించారని రమేష్ తెలిపారు. ఉదయం రమేష్ తల్లి సావిత్రి లైట్ వేసి చూసే సరికి బీరువా తెరిచి కనిపించింది. పరిశీలించి చూస్తే.. బంగారు ఆభరణాలు, రూ. 15 వేలు నగదు కనిపించలేదు. దీంతో వెంటనే 100కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం అందజేశారు. చోరీ గురించి తెలుసుకున్న టెక్కలి డీఎస్పీ బాలచంద్రారెడ్డి ఇంటికి వచ్చి పరిశీలించారు. చోరీ ఎలా జరిగిందనేది రమేష్‌తో పాటు కుటుంబ సభ్యులు సావిత్రి, లావణ్యలను ప్రశ్నించి తెలుసుకున్నారు. అనంతరం క్లూస్ టీమ్ వచ్చి వేలి ముద్రలు సేకరించారు. చోరీ ఎలా జరిగింది అనే దానిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. చోరీ దొంగల పనా లేదా తెలిసిన వారు ఎవరైనా పాల్పడి ఉంటారా అనేది పోలీసులు అనుమానిస్తున్నారు. దీనిపై నరసన్నపేట ఎస్‌ఐ సింహాచలం వద్ద ప్రస్తావించగా దర్యాప్తు చేస్తున్నామని అన్నారు.

ఆయిల్ పామ్ సాగు..

లాభాలు బాగు

- ఎకరాకు రూ.లక్ష ఆదాయం
- జిల్లావ్యాప్తంగా 185 హెక్టార్లలో సాగు
- ఏటా ఒక్కో మొక్కకు 12 గెలలు ఫలసాయం
- పంట కొనుగోలు బాధ్యత ప్రభుత్వానిదే



ఆయిల్‌పామ్ మొక్కలు నాటిన దృశ్యం

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): ఉద్యాన పంటల సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహకాలను అందిస్తోంది. ప్రస్తుత పరిస్థితుల్లో ఆయిల్‌పామ్ రైతులకు అధిక ఆదాయాన్ని సంపాదించి పెడుతోంది. ఆయిల్ పామ్ అన్ని శాశ్వత పంటల్లో అత్యధిక నూనె దిగుబడిని ఇచ్చే పంటల్లో ఒకటి. హెక్టారుకు 20 టన్నుల పళ్లగెల దిగుబడినిస్తుంది. అలాంటి ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వం ప్రత్యేక రాయితీలు కల్పిస్తోంది. దీంతో రైతులు ఆయిల్ పామ్ సాగుకు ఆసక్తి చూపుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 185 హెక్టార్లలో సాగు చేస్తున్నారు. పామాయిల్ పంటల్లో అంతర పంటలు వేసి వాటిలోనూ లాభాలను సంపాదించుకోవచ్చు.

ఇవీ ప్రయోజనాలు

- ఏడాది పొడవునా నెలవారీ ఆదాయం, మార్కెట్ ధరకు హామీ ఉంటుంది.
- దొంగతనం భయం లేని పంట.
- ఆయిల్‌పామ్ పంటలో తెగుళ్లు, వ్యాధులు చాలా తక్కువ.
- మొదటి మూడేళ్లలో ఏక వార్షిక పంటలైన కూరగాయలు, పూలు, అరటి, పసుపు, అల్లం, పైనాపిల్ వంటివి అంతర పంటలుగా వేసుకోవచ్చు. ఆ తర్వాత నీడను ఇష్ట పడే పంటలు (కోకో) అంతర పంటగా సాగు చేయుట ద్వారా అదనపు ఆదాయాన్ని పొందవచ్చు.
- ఆయిల్ పామ్ 4–8 ఏళ్ల గల తోట నుంచి ఎకరానికి 6–7 టన్నుల దిగుబడి వస్తుంది.
- 8 ఏళ్లకు పైబడిన తోట నుంచి ఎకరానికి 8–12 టన్నుల దిగుబడి వస్తుంది.

రాయితీ ఇలా..

- ఆయిల్ పామ్ సాగులో రెండు రకాల మొక్కలను సాగు చేసేందుకు ఉపయోగిస్తున్నారు.
- స్వదేశీ రకం ఒక్కో మొక్కకు రూ.133, దిగుమతి రకం మొక్క రూ.193 రాయితీ ప్రభుత్వం అందిస్తుంది.
- ఆయిల్‌పామ్ మొక్క కొనుగోలుకి ప్రభుత్వం స్వదేశీ రకానికి హెక్టార్‌కి రూ 20,000, దిగుమతి రకానికి రూ.28,000 రాయితీని కల్పిస్తోంది. మొదటి నాలుగేళ్లకు సాగు ఖర్చుల కోసం ఏడాదికి రూ.5250 చొప్పున హెక్టారుకు రూ.21,000, అంతరపంటలు పండించేందుకు మొదటి నాలుగేళ్లకు హెక్టారుకు రూ.21,000 రాయితీ కల్పిస్తోంది.
- ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహిస్తూ బిందు సేద్యం పరికరాలకు కూడా చిన్న,సన్నకారు రైతులకు 90శాతం ఇతర రైతులకు 50శాతం రాయితీని అందిస్తోంది.



నాటిన మొక్కలకు గెలలు వేసిన దృశ్యం

రైతుల్లో ఆసక్తి..

ప్రస్తుతం ఇతర పంటలకు గిట్టుబాటు ధరలు లేక పోవడం, ఆయిల్‌పామ్ పంటకు గిట్టుబాటు ధర, రైతులకు ఉద్యానశాఖ ప్రోత్సాహకాలు లాభదాయకంగా ఉండడంతో మన జిల్లాలో రైతులు ఆయిల్ పామ్ సాగుకు మొగ్గుచూపుతున్నారు. ప్రధానంగా గార, రణస్థలం, లావేరు, జి.సిగడాం, పొందూరు, ఎచ్చెర్ల, బూర్జ, ఆమదాలవలస, నరసన్నపేట, పోలాకి, శ్రీకాకుళం మండలాల్లో ఆయిల్ పామ్ పంట ఎక్కువగా సాగు చేస్తున్నారు. ఈ ఆర్థిక సంవత్సరానికి గాను 815 హెక్టార్లు భౌతిక లక్ష్యంగా జిల్లాలో ఆయిల్ పామ్ సాగుకు చర్యలు తీసుకున్నారు. ఇదివరకు జిల్లాలో రెండు ఆయిల్ పామ్ కంపెనీలు (పతాంజలి ప్రైవేట్ ఫుడ్ కంపెనీ, శ్రీ శ్రీనివాస ఆయిల్ మిల్) 20 మండలాల్లో మొక్కలు సరఫరా చేశాయి. ఇప్పుడు జిల్లాలో మరో ఆరు మండలాలను ఆయిల్ పామ్ సాగు మండలాలుగా గుర్తించారు. ప్రస్తుతం ఒక ఆయిల్ పామ్ కంపెనీ ఎమ్/ఎస్ శాంతి ఆయిల్ పామ్ ఇండస్ట్రీ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ అదనంగా జిల్లాలో ఆయిల్ పామ్ మొక్కలు సరఫరా చేసేందుకు కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు.

లాభాలు కురిపిస్తుంది



ఆయిల్ పామ్ పంట 35 ఎకరాల్లో సాగు చేస్తున్నాను. 2022–23 సంవత్సరానికి గాను ఎకరానికి 14 టన్నుల చొప్పున 490 టన్నుల దిగుబడి వచ్చింది. ప్రతి 15 రోజులకు ఆయిల్ పామ్ గెలలు కోతకు వస్తున్నాయి. ఒక్కో చెట్టుకి నెలకు ఒక గెల చొప్పున ఏడాదికి 12 గెలలు దిగుబడి వస్తుంది. దీంతో నెలనెలా ఆదాయం వస్తుంది. ప్రభుత్వం రాయితీకే మొక్కలు అందిస్తుంది.

– కలిదిండి రామరాజు, నెలివాడ, రణస్థలం మండలం.

రాయితీపై మొక్కలు



రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులకు అనేక రకాలుగా రాయితీలను కల్పిస్తుంది. రైతులు ఒక హెక్టారుకు 143 మొక్కలను వేసుకోవాల్సి ఉంటుంది. దీనికి గాను ఉద్యానశాఖ నుండి స్వదేశీ రకానికి హెక్టారుకు రూ.20 వేలు దిగుమతి రకానికి రూ.28,000, రాయితీని కల్పిస్తోంది. మొదటి నాలుగేళ్ల సాగు ఖర్చులకు హెక్టారుకు రూ.21వేలు సంవత్సరానికి చొప్పున రాయితీ, మొదటి నాలుగేళ్లకు అంతరపంటలు పండించేందుకు రూ.21వేలు రాయితీ ఉంది.

– ఆర్.వి ప్రసాద్, ఉద్యానవనశాఖ, అసిస్టెంట్ డైరెక్టర్

గ్రామాల్లో నాయకత్వం ఉంటేనే అభివృద్ధి



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు, ధర్మాన కృష్ణదాస్

- రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం రూరల్: గ్రామాల్లో నాయకత్వం ఉంటేనే అభివృద్ధి జరుగుతుందని, కొన్ని గ్రామాల్లో నిధులు మంజూరైనప్పటికీ వేర్వేరు కారణాలతో కొంతమంది వాటిని వినియోగించలేక పోతున్నారని రాష్ట్ర రెవెన్యూ రిజిస్ట్రేషన్ స్టాంప్స్ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. జిల్లా పంచాయతీ రాజ్ విభాగపు అధ్యక్షుడు అంబటి శ్రీనువాసరావు అధ్యక్షతన మండల పరిధిలోని బైరి గ్రామంలో ఆదివారం సచివాలయం, రైతు భరోసా కేంద్రం, శానిటరీ కాంప్లెక్స్ ప్రారంభోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గడిచిన ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీ సభ్యులకు కొంత నగదు చెల్లిస్తేనే ప్రభుత్వ పథకాలు ఇచ్చేవారని, తమ ప్రభుత్వంలో అలాంటి దళారులు లేరని అన్నారు. జిల్లాకు ఫిషింగ్ హార్బర్, పోర్టులు వస్తున్నాయని, రిమ్స్‌లో కార్పొరేట్ తరహా వైద్యం అందుతోందని తెలిపారు. పల్లెల్లోని బడుల్లో వచ్చిన మార్పులను గమనించాలని కోరారు. ధరలు అనేవి కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉంటాయని, అవి దేశవ్యాప్తంగా ఒకేసారి పెరుగుతాయన్నారు. ఇది రాష్ట్ర ప్రభుత్వానికి ముడిపెట్టడం సరికాదన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ మాట్లాడుతూ తమ ప్రభుత్వం విద్య, వైద్యానికి పెద్దపీట వేస్తోందన్నారు. ప్రభుత్వం తను చేసే ప్రతి పనికీ జవాబుదారీగా ఉంటోందన్నారు. జిల్లా ప్రధాన అవసరాలు తీర్చడంలో మంత్రి ధర్మాన ముందంజలో ఉండడం అన్నగా తనకు గర్వకారణమన్నారు. చంద్రబాబునాయుడే బలంగా ఉంటే పవన్ కల్యాణ్ సాయం ఎందుకు కోరుతాడని ఆయన ప్రశ్నించారు.



మంత్రి ధర్మాన ప్రసాదరావు, కృష్ణదాస్‌లకు స్వాగతం పలుకుతున్న దృశ్యం

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువనేత ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు మాట్లాడుతూ గడిచిన ప్రభుత్వ హయాంలో జిల్లా వెనుకబడి పోవడానికి కారణం తెలుగుదేశం పార్టీయేనన్నారు. ధర్మాన ప్రసాదరావు జిల్లాకు చేసిన అభివృద్ధి మాటల్లో చెప్పలేమని అన్నారు. ఎంపీపీ అంబటి నిర్మల మాట్లాడుతూ బైరి గ్రామాన్ని అభివృద్ధి చేసిన ఘనత మంత్రి ధర్మాన ప్రసాదరావుకు దక్కుతుందన్నారు. ఈ సందర్భంగా వెల్‌నెస్ సెంటర్, స్కూల్ బిల్డింగ్‌కు రూ. 42 లక్షలతో శంకుస్థాపన చేశారు. అలాగే ఇంటింటికీ పైపులైన్లు, ఓహెచ్ ఎస్ఆర్, కలిపి రూ.కోటి 50 లక్షలతో నిధులు మంజూరు చేశారన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.వెంకటరావు, ఎంపీడీఓ రామ్మోహన్, డీసీఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, గార ఎంపీపీ గుండ రఘురామ్, మండల పార్టీ అధ్యక్షుడు చిట్టి జనార్దన్ రావు, చల్లా రవికుమార్, ఎంపీటీసీ నక్క శంకర్, బగ్గు అప్పారావు, పంచాయతీ సర్పంచ్ ముద్దాడ ఇందుమతి, వైఎస్సార్ పార్టీ జిల్లా సెక్రటరీ గుండ మోహన్, తదితరులు పాల్గొన్నారు.

'నా భర్త ఆచూకీ తెలపండి'



వీరావల్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న మంత్రి సీదిరి అప్పలరాజు

ఎచ్చెర్ల క్యాంపస్: రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు దృష్టికి బడివానిపేట గ్రామానికి చెందిన తోటమ్మ తన సమస్య తీసుకువెళ్లారు. ఆమె మంత్రి సీదిరిని ఆదివారం పలాసలో కలిశారు. గత నెల 29న తన భర్త అల్లుపల్లి పోలీస్ గుజరాత్ రాష్ట్రం వీరావల్ వలస వెళ్లారని, అప్పటి నుంచి కనిపించడం లేదని తెలిపారు. అక్కడి అధికారులు, ప్రభుత్వంతో మాట్లాడి సమస్య పరిష్కరించాలని కోరారు. తన భర్తకు ఫోన్ చేస్తుంటే ఎవరో హిందీలో మాట్లాడుతున్నారని, అక్కడ మత్స్యకారులు వీరావల్ పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు చేయగా.. పోలీసులు కేసు నమోదు చేశారని తెలిపారు. తన భర్త ఆచూకీ కనుగొనేలా చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు. ఆమె సమస్య విన్న మంత్రి సీదిరి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో బడివానిపేట సర్పంచ్ కారి తాతారావు, మాజీ సర్పంచ్ వారధి ఎర్రయ్య, జిల్లా మత్స్యకార సంఘం అధ్యక్షుడు కోనాడ నర్సింగరావు ఉన్నారు.

చికెన్ దుకాణంలో అగ్ని ప్రమాదం

పొందూరు: స్థానిక మహరాజా మార్కెట్‌లో ఆదివారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో కొయ్యాణ నారాయణరావుకు చెందిన చికెన్ దుకాణం పూర్తిగా దగ్ధమైంది. చికెన్ దుకాణంలో గ్యాస్‌లీక్ కావడంతో మంటలు చెలరేగి దుకాణం కాలిపోయింది. ప్రమాదంలో పరికరాలు, కోళ్లు అగ్నికి ఆహుతయ్యాయి. సుమారు రూ.70 వేలు ఆస్తినష్టం జరిగిందని నారాయణరావు చెప్పారు. అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు.

తప్పిన ప్రమాదం




బొలెరో వాహనాన్ని బయటకు తీస్తున్న దృశ్యం

మెళియాపుట్టి : మండలంలోని మురికింటి భద్ర నుంచి పలాస వెళ్లే రహదారిలో మర్రిపాడు కె.గ్రామానికి సమీపంలోని మలుపులో ఓ లగేజీ బొలెరో వాహనం అదుపు తప్పి పొలాల్లోకి వెళ్లిపోయింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. డ్రైవర్ స్వల్పగాయాలతో బయట పడ్డారు. ట్రాక్టర్ సహాయంతో బొలెరోను బయటికి తీశారు. కాసేపు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

నరసన్నపేట, జలుమూరు:

జాతీయ రహదారికి ఆనుకొని సర్వీసు రోడ్డుపై స్థానిక మార్కెట్ కమిటీ ఎదురుగా ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల్లో మొదటి సంవత్సరం బీఏ చదువుతున్న పైల సాయి కుమార్ (21) మృతి చెందాడు. ద్విచక్ర వాహనం నడుపుతున్న రావులవలస నాగేశ్వరరావుకు స్వల్ప గాయాలయ్యాయి. జలుమూరు మండలం మెట్టపేట గ్రామానికి చెందిన సాయి కుమార్ జగన్నాథపురంలో తన అమ్మమ్మ వద్ద ఉంటూ చదువుకుంటున్నాడు. విద్యార్థి తల్లిదండ్రులు, అన్న హైదరాబాద్‌లో ఉంటున్నారు. సోమవారం వినాయక చవితి పూజలకు అవసరమైన సామగ్రి కొనుగోలు చేయడానికి స్నేహితుడు నాగేశ్వరరావుతో కలసి నరసన్నపేట ద్విచక్ర వాహనంపై వస్తున్నప్పుడు మార్కెట్ కమిటీ వద్ద వీరి బండిని లారీ ఢీకొట్టింది. వాహనం నడుపుతున్న నాగేశ్వరరావు ప్రమాదం నుంచి బయటపడగా వెనక ఉన్న సాయి లారీ టైర్ల కింద పడి అక్కడకక్కడే మృతి చెందాడు. సర్వీసు రోడ్డు నుంచి నరసన్నపేట టౌన్ లోనికి వచ్చేందుకు షార్ట్ కట్ రోడ్డులో వీరు బైక్‌పై వస్తుండగా అదే సమయంలో లారీ అదే మార్గంలో టౌన్‌లోకి రావడంతో ప్రమాదం జరిగింది. సర్వీసు రోడ్డు నుంచి ముందుకు వెళ్లి టౌన్‌లోకి వచ్చేందుకు పక్కా రోడ్డు ఉండగా అడ్డురోడ్డులో నుంచి టౌన్‌లోనికి ప్రవేశించేందుకు లారీ డ్రైవర్ ప్రయత్నించడంతో ప్రమాదం జరిగిందని స్థానికులు అంటున్నారు. ప్రమాదం గురించి తెలుసుకున్న ఎస్‌ఐ సింహాచలం సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సాయి మృతితో అటు మెట్టపేట ఇటు జగన్నాథపురంలో విషాదం అలుముకుంది. కుమారుడి మరణవార్తను తల్లిదండ్రులకు తెలియజేశారు. వారు హైదరాబాద్ నుంచి బయల్దేరారు.



సంఘటనా స్థలంలో లారీ చక్రాల కింద పడి మృతి చెందిన సాయి కుమార్



సాయి కుమార్ (ఫైల్)

పలాస నటుడికి నంది పురస్కారం



ప్రముఖుల నుంచి నంది పురస్కారం అందుకుంటున్న సినీ నటుడు కుమార్ నాయక్

పలాస: తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ సారస్వత్ పరిషత్ ఆవరణలో ఆర్‌కే కళా సాంస్కృతిక ఫౌండేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు శతజయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలో పలాస–కాశీబుగ్గకు చెందిన డాక్టర్ కుమార్ నాయక్‌కు నంది పురస్కారం లభించింది. ఈ సందర్భంగా సెంట్రల్ ఫిల్మ్ సెన్సార్ బోర్డ్ సభ్యులు మోగులపల్లి ఉపేంద్ర, ప్రముఖ బెంగాలీ సినీ నటి నిషా ప్రాన్సిస్, తెలంగాణ తమిళ కన్నడ సినీనటి ఖుషి పూరి చేతులు మీదుగా స్వర్ణ కంకణ, నంది పురస్కారం అందుకున్నారు. వాడు ఎవడు, ఓ కౌన్ హై హిందీ డబ్బింగ్ వెర్షన్‌లో సినిమా విడుదలైన సందర్భంగా అందులో కుమార్ నాయక్ తనదైన శైలిలో ప్రతిభ కనబరిచినందుకు ఈ అవార్డు లభించింది. వీరగున్నమ్మ, సురభి70 ఎంఎం, నాకొక శ్రీమతికావాలి, పలాస 1978, రెండక్షరాల ప్రేమ తదితర చిత్రాలాల్లో కుమార్ నాయక్ నటించారు.

'సానుభూతి కోసం వస్తున్నారు'



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, నాయకులు

కాశీబుగ్గ: స్కిల్ డెవలప్‌మెంట్ పేరుతో తన సొంత ఏజెన్సీలు ఏర్పాటు చేసి ప్రజల సొమ్ము కాజేసిన ఆర్థిక నేరస్తుడు చంద్రబాబునాయుడు అని పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ నాయకులు ఆరోపించారు. మంత్రి క్యాంప్ కార్యాలయంలో వారు ఆదివారం విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు అరెస్టు పేరుతో ఆ పార్టీ నాయకులు జనంలోకి సానుభూతి కోసం వస్తున్నారని, అలాంటి వారిని దగ్గరకు కూడా రానీయకూడదని అన్నారు. అడ్రస్ లేని వారిని పలాస నియోజకవర్గం తీసుకొచ్చి వారిచేత మంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేయించడంపై గౌతు శివాజీకి, ఆయన కుమార్తె శిరీషకు తగదన్నారు. గౌతు కుటుంబం 60 ఏళ్ల పాలనలో చేయని పనులు మంత్రి చేస్తున్నారని, అయినా ఇలాంటి చౌకబారు రాజకీయాలు చేస్తే తాము కూడా మాట్లాడగలమని అన్నారు. పవన్ కల్యాణ్ బీజేపీ, టీడీపీ, ఎర్రజెండా పార్టీలంటూ స్పష్టత లేక క్యాడర్‌ను టీడీపీలో కలిపేశారని అన్నారు. శిరీష ఎమ్మెల్యే అవ్వాలని పిచ్చి ప్రేలాపనలు చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, వైస్ చైర్మన్ బోర కృష్ణారావు, ఏఎంసీ చైర్మన్ పీపీ సతీష్, సీహెచ్‌సీ చైర్మన్ డబ్బీరు భవానీశంకర్, నాయకులు శిష్టు గోపి, బడగల బళ్లయ్యనాయుడు, గుజ్జు జోగారావు, బళ్ల శ్రీనివాసరావు, సనపల సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

మొబైల్ ఫోన్లు చోరీ

నరసన్నపేట: స్థానిక కొత్తవీధి వద్ద ఐస్ ఫ్యాక్టరీ యజమాని నల్లాన జోగారావు ఇంటిలో మొబైల్ ఫోన్లను చోరీ చేశారు. శుక్రవారం ఉదయం ఐస్ కోసం వచ్చిన ఆ వ్యక్తి ఎవరూ లేక పోవడంతో ఫ్యాక్టరీకి ఆనుకొని ఉన్న ఇంటిలో ఈ సెల్‌ఫోన్లను కొట్టేశాడు. సీసీ పుటేజీలు పరిశీలించి పోలీసులకు ఫిర్యాదు చేశామని జోగారావు ఆదివారం విలేకరులకు తెలిపారు.